క్లుప్తంగా

రైతుబంధు విడుదల చేయాలి

మరికల్: వర్షకాలం పంటలకు సంబంధించి ప్రభుత్వం వెంటనే రైతుబంధు విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు హన్మంతు, దండుశ్రీనివాస్‌రెడ్డి, భూనేడ్ వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ జూన్ మొదటి వారంలో రైతుల ఖాతాలో జమ చేయాల్సిన రైతుబంధు 19 రోజులు గడుస్తున్నా నేటికి విడుదల చేయకపోవడం సరికాదన్నారు. మండలంలో కొందరు నాయకులు ప్రభుత్వ భూములను, ప్లాట్లను కబ్జా చేయడం కోసమే అధికార పార్టీలో చేరుతున్నారని విమర్శించారు. ఇలాంటి నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి

కృష్ణా: వ్యవసాయ అధికారుల సూచనలు రైతులు పాటించాలని ఏఓ సుదర్శన్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రుతుపవనాలు రాక ఆలస్యం అవుతోందని రైతులు తొందరపడి విత్తనాలు విత్తుకోవద్దని సూచించారు. వర్షాలు పడిన తర్వాత పత్తి విత్తనాలు వేయాలని కోరారు. రెండు వారాల నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉందని తొలకరి వర్షాలు కురిసిన వెంటనే విత్తనాలు వేస్తే భూమి వేడిమికి మొలకెత్తవన్నారు. వర్షాలు పడి భూమి చల్లబడిన తరువాత విత్తనాలు విత్తుకోవాలని కోరారు.

విద్యార్థికి ప్రతిభ పురస్కారం



కృష్ణా: మండల కేంద్రానికి చెందిన సర్పంచ్ రాధ మహాదేవ్ కూతురు భవాని ఇటీవల ఇంటర్ పరీక్షల్లో 980/1000 మార్కులు సాధించింది. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ బీసీ మహాసభ ఆధ్వర్యంలో విద్యార్థినికి ప్రతిభ పురస్కారం అందించారు. భవిష్యత్తులో మంచిగా చదివి ఉన్నత స్థానంలో స్థిరపడి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అదేవిధంగా మండల ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు అభినందించారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయరా?

మరికల్: కొత్తగా ఏర్పడిన మరికల్ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసే విషయం ప్రజాప్రతినిధులకు, అధికారులకు పట్టడం లేదాన్ని యువక మండలి అధ్యక్షులు రవికిరణ్, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన అన్ని మండల కేంద్రాల్లో జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారన్నారు. కానీ మరికల్‌లో మాత్రం ఏర్పాటు చేయకపోవడంతో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు మాత్రం ఉన్నత విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సర్వే నంబర్ ఒకటిలో ఉన్న ప్రభుత్వ స్థలంలో కళాశాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



నారాయణపేట: అమావాస్యను పురస్కరించుకొని కర్ణాటకలోని దేవసూగురులో ప్రసిద్ధిగాంచిన సూగురేశ్వర స్వామి, ఎల్లమ్మ తల్లికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మంత్రికి ఘనస్వాగతం పలికి శాలువా, పూలమాలతో సన్మానించారు. మంత్రితో పాటు మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింహగౌడ్ ఉన్నారు.

అమావాస్య పూజలు

ఊట్కూర్: మండల కేంద్రంలోని శబరి పీఠంలో ఆదివారం అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన డబ్బ శంకర్ దంపతులు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి పంచామృతాభిషేకం, అష్టోత్తరం, అంగపూజ, మహానైవేద్యం, భజన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు రఘువీర్, శంకర్, శ్రీనివాస్, బానుచందర్, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

సాయితేజకు ప్రతిభా పురస్కారం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇటీవల విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన కర్నెకోటనాగేశ్వరి సాయితేజకు ప్రతిభా పురస్కారం లభించింది. మాస్టర్ మైండ్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో పురస్కారంతో పాటు నగదు ప్రోత్సాహకం అందజేశారు. అకాడమీ ఇన్‌చార్జ్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ సాంబశివుడు పాల్గొన్నారు.

గ్రంథాలయాల నిర్వహణ అస్తవ్యస్తం

- శిథిలావస్థలో భవనాలు
- కన్పించని కొత్త పుస్తకాలు
- అంటెండర్లతో నెట్టుకొస్తున్న వైనం



మరికల్‌లో పాత గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న గ్రంథాలయం

మరికల్: పట్టణాలు, పల్లెల్లో విజ్ఞానకాంతులు పూయించడానికి ఏర్పాటు చేసిన గ్రంథాలయాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. జిల్లాలోని చాలా మండలాల్లో గ్రంథాలయాల నిర్వహణ గాడి తప్పుతోంది. పలుచోట్ల ఏళ్లుగా పాత భవనాల్లోనే కొనసాగుతున్నాయి. చాలా చోట్ల కొత్త పుస్తకాల ఊసే లేదు. పోటీ పరీక్షల సమయంలో పేద విద్యార్థులకు సరైన పుస్తకాలు దొరకడం లేదు. చాలాచోట్ల గ్రంథపాలకులు లేక అటెండర్లే పెద్ద దిక్కుగా ఉంటు వాటిని నడిపిస్తున్నారు. దీంతో విజ్ఞాన కేంద్రాలకు వెళ్లేందుకు పాఠకులు ఆసక్తి చూపడం లేదు.

పరిస్థితి ఇలా..

నారాయణపేట మినహా నియోజకవర్గంలో మిగిలిన మండలాల్లో గ్రంథాలయాల నిర్వహణ ఇబ్బందిగా మారింది. దామరగిద్దలో ఆరేళ్ల కిందట సొంత భవనం సమకూరినా అంటెడర్లే దిక్కయ్యారు. ధన్వాడలో కొన్నేళ్ల కిందట నిర్మించిన సొంత భవనానికి బీటలు ఏర్పడ్డాయి. ధన్వాడ, నర్వకు ఒక్కరే గ్రంథపాలకుడిని కేటాయించడంతో విధులకు సరిగ్గా హాజరు కాలేని పరిస్థితి.

కొత్త మండలాల్లోనూ...

జిల్లాలో కొత్తగా ఏర్పడిన మరికల్, కృష్ణా మండలాల్లో గ్రంథాలయాల ఊసే లేదు. కృష్ణాలో ఇప్పటి వరకు గ్రంథాలయం లేకపోవడంతో ఉన్నత విద్యాభ్యాసం పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరికల్ మండల కేంద్రంలో పాత పంచాయతీ కార్యాలయంలో తాత్కాలిక సిబ్బందితో కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. పేద విద్యార్థులకు పోటీ పరీక్షలకు పుస్తకాలు అందుబాటులో లేక ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో పని చేసిన గ్రామీణ గ్రంథాలయాలు పూర్తిగా మూతబడ్డాయి. నిర్వహణను పట్టించుకునే నాథుడే లేడు. ఏటా వారోత్సవాలకే పరిమితమవుతున్న పాలకవర్గ సభ్యులు అభివృద్ధికి పాటుపడడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. విజ్ఞాన కేంద్రాల్లో పుస్తకాలు లేకున్నా, రోజు వారీగా దినపత్రికలు రాకున్నా పట్టించుకోవడం లేదు. గతంలో పంపిణీ చేసిన పాత పుస్తకలు ఇటీవల వచ్చిన కొన్ని పుస్తకలు మాత్రమే పాఠకులకు అందుబాటులో ఉన్నాయి.

కొత్తపుస్తకాలు తెప్పించాలి..



ఉన్నత విద్యను అభ్యసించడం కోసం, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు అనుగుణంగా గ్రంథాలయాల్లో కొత్త పుస్తకాలను తెప్పించాలి. గతంలో ఉన్న పాత పుస్తకాలు తో ఎలాంటి ఉపయోగం లేకుండా పోతోంది. ఇప్పటికైనా సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి.

– శ్రీకాంత్‌రెడ్డి, మరికల్

సమస్యలు పరిష్కరించాలి..



విద్యార్థులకు విజ్ఞానం అందించే గ్రంథాలయాలకు ప్రభుత్వం కొత్త భవనాలను నిర్మించాలి. అలాగే ప్రతి గ్రామంలో గ్రామీణ గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి. శిథిలావస్థకు చేరిన వాటిల్లో కొనసాగించడం వల్ల వర్షాకాలంలో ప్రమాదం పొంచివుంది. నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యేందుకు నూతన పుస్తకాలు తెప్పించాలి.

– రాంచంద్రయ్యగౌడ్, తీలేర్

ప్రతిపాదనలు పంపించాం..

శిథిలావస్థకు చేరిన గ్రంథాలయ భవనాల స్థానంలో నూతనంగా నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతం ప్రత్యేక నిధులు ఏమీ లేవు. ఉన్నవాటిలో సర్దుకుంటున్నాం. గ్రంథపాలకులకు వేతనాలు ఇవ్వాలేని పరిస్థితి ఉంది. పోటీ పరీక్షలకు కొత్త పుస్తకాలు రావాల్సింది.

– సురేష్‌బాబు, ఉమ్మడి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి, మహబూబ్‌నగర్

వానదేవుడా దయచూడు



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

మరికల్: మండల కేంద్రంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో వర్షాల కురవాలని గ్రామస్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వానదేవుడిని వేడుకుంటూ భజనలు చేశారు. అనంతరం గ్రామస్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. పూజారి వెంకటేశ్వర్లశర్మ, సూర్యమోహన్, జగన్, రాజేష్, రాంచంద్రయ్యగౌడ్, పుల్లయ్యగౌడ్, పురోషోత్తంరెడ్డి, రమేష్, లక్ష్మీప్రసాద్. వెంకటేష్, కృష్ణచారీ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ బలోపేతమే లక్ష్యం



చేగుంట గ్రామ అధ్యక్షుడు రాకేష్

కృష్ణా: ఎమ్మార్పీఎస్ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తామని మక్తల్ నియోజకవర్గ కన్వీనర్ కర్రెప్ప అన్నారు. ఆదివారం మండలంలోని చేగుంటలో ఎమ్మార్పీఎస్ గ్రామా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో 30 లక్షల మందితో చలో హైదరాబాద్ నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాకేష్, అధికార ప్రతినిధిగా అంజప్ప, ఉపాధ్యక్షుడిగా దుర్గేష్, ప్రధాన కార్యదర్శిగా మారెప్ప, కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా నర్సింహా, ప్రచార కార్యదర్శిగా సీ కరెప్పలను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. ఇందులో తేజ, మహేష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థికి సన్మానం



విద్యార్థి బాల్‌రాజ్‌ను సన్మానిస్తున్న మాదాసి కుర్వ సంఘం నాయకులు

ఊట్కూర్: మండల కేంద్రంలోని వేంకటేశ్వర నగర్ వీధికి చెందిన కుర్వ నీలమ్మ హన్మంతుల కుమారుడు బాల్‌రాజ్ నీట్‌లో ప్రతిభ కనపరచడంతో ఆదివారం మాదాసి కుర్వ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థికి, తల్లిదండ్రులకు ఘనంగా సన్మానించారు. నీట్‌లో 720 మార్కులకు 657 మార్కులు సాధించాడు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఊట్కూర్ నలంద పాఠశాలలో, 6,7 తరగతులు నారాయణపేటలోని లిటిల్ స్టార్ స్కూల్‌లో, 7 నుంచి 10 తరగతి వరకు ధన్వాడలోని మాడల్ స్కూల్‌లో, ఇంటర్ మీడియట్ మేధా ట్రస్ట్ హైదరాబాద్‌లో విద్యాభ్యాసం చేశాడు. నీట్‌లో ప్రతిభ కనపరచడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మాదాసి కుర్వ నియోజక వర్గ అధ్యక్షుడు కుర్వ ఆశప్ప, మాజీ ఎంపీటీసీ గోవిందప్ప, కుర్వ రామప్ప, లక్ష్మణ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలు



ఘటన స్థలంలో ప్రాథమిక వైద్యం అందిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

మాగనూర్: మండల కేంద్రంలోని నల్లగట్టు మారెమ్మవ్వ దేవాలయం సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పిన సంఘటనలో ఒకరికి గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ మన్నన్ తెలిపిన వివరాల ప్రకారం కృష్ణ మండలం హిందుపూర్ గ్రామానికి చెందిన గణేష్ మక్తల్ పట్టణంలో హమలీగా పని చేస్తున్నాడు. పనులు ముగించుకొని మక్తల్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా మారెమ్మవ్వ ఆలయం సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

అందుబాటులో వరి విత్తనాలు

ఊట్కూర్: ఆగ్రో రైతు సేవా కేంద్రంలో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి గణేశ్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్ఎన్ఆర్ –15048 రకం 25 కిలోల బస్తా ధర రూ.913, ఎంటీయూ 1010 రకం 25 కిలోల బస్తా రూ.882, కేఎస్ఎం 118 రకం 25 కిలోల బస్తా రూ.882, బీపీటీ 5204 రకం 25 కిలోల బస్తా రూ. 887 లకు విక్రయిస్తునట్లు పేర్కొన్నారు. పట్టాపాసు పుస్తకం, ఆధార్ కార్డులను చూయించి విత్తనాలను కొనుగోలు చేయాలని కోరారు.

జీలుగ విత్తనాలు..

దామరగిద్ద: ప్రభుత్వం స్టేట్ సీడ్ కార్పోరేషన్ ద్వారా సరఫరా చేస్తున్న జీలుగ విత్తనాలు మండలంలోని ఆగ్రోరైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి అరవింద్ తెలిపారు. గతంలో సరఫరా చేసిన 80 క్వింటాళ్లు సరఫరా చేయగా రైతుల నుంచి డిమాండ్ ఉండటంతో జిల్లా వ్యవసాయ అధికారి ప్రత్యేక చొరవతో మండలానికి మరో 55 క్వింటాళ్లు అలాట్‌మెంట్ అయినట్లు తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

ధన్వాడ: మండలంలోని మందిపల్లి తండాకి చెందిన ఇరువర్గాలపై భూతగాదా విషయంలో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. తండాకు చెందిన వ్యవసాయ భూమి విషయంలో రాజునాయక్, తౌర్యనాయక్‌కు చెందిన ఇరువర్గాల వారు ఘర్షణకు దిగారు. దీంతో మొత్తం 26 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

రమేష్‌గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి

నారాయణపేట: రాష్ట్ర గౌడ సంఘం వర్కింగ్ ప్రసిడెంట్ బొబ్బిలి రమేష్‌గౌడ్ గుండెపోటుతో మృతి చెందిన సమాచారాన్ని అందుకున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం నారాయణపేటకు చేరుకున్నారు. రమేశ్‌గౌడ్ భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి సతీమణి స్వాతిరెడ్డి, రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు నాగరాజు గౌడ్, డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి, దామరగిద్ద మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, పాలమూరు గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు ఎల్.మనోహర్‌ప్రసాద్ గౌడ్ , మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కన్నా జగదీశ్ తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బడిబయటి పిల్లలను బడిలో చేర్పించాలి

ఊట్కూర్: బడిబయటి పిల్లలను బడిలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు ఫజల్ అహ్మద్ కోరారు. ఆదివారం మండలంలోని ఎంకంపేట్, గుంతల్ గేరి, గాంధీనగర్ ప్రాంతాల్లో బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తే కలిగే ప్రయోజనాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం 10 మంది చిన్నారులు అడ్మిషన్లు పొందారు. కార్యక్రమంలో ఇబ్రహింసాబ్, మంసూర్, అన్వర్, వికార్ యూనుస్, ఉపాధ్యాయులు అబ్దుల్ గఫార్, అబ్దుల్ కరీంసాబ్, ఫర్‌హత్ బేగం తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. నరకప్రాయం



కంకరతేలిన రోడ్డు

- పూర్తిగా ధ్వంసమైన మేడేపల్లి రహదారి
- పదేళ్లుగా ప్రయాణికుల పాట్లు



దెబ్బతిన్న మేడేపల్లి రహదారి

ఆత్మకూర్: ఏళ్ల గడుస్తున్న పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. మండలంలోని మేడేపల్లికి వెళ్లేందుకు స్టేజి నుంచి 2కిలో మీటర్లమేర బీటీ రోడ్డును వేశారు. 2004లో వేసిన రోడ్డు ప్రస్తుతం పూర్తిగా ధ్వంసమై, గుంతలమయంగా మారింది. మరమ్మతు చేయాలని, లేకుంటే కొత్త బీటీరోడ్డు వేయించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్న ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఇప్పటికైన స్పందించి చర్యలు తీసుకోవాలని మేడేపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

వర్షాలు కురవాలని కప్పల పెళ్లి



కప్పల ఊరేగింపులో చిన్నారులు

మాగనూర్: వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పుష్కలంగా పండాలని మండలం కొత్తపల్లి గ్రామస్తులు కప్ప తల్లి(కప్పల పెళ్లిలు) ఆటలు ఆడి, గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఊరేగించారు. అనంతరం కప్పలను వ్యవసాయ బావిలో వదిలారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రత్యేక వేషధారణలతో అలరించారు.

బస్టాండ్‌లో వసతులు కరువు



అమరచింత బస్టాండ్‌లో మరమ్మతులకు నోచుకోని మరుగుదొడ్లు

అమరచింత: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస వసతులను కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. బస్సుల రాకపోకల సమాచారం కూడా నోటీసు బోర్డుపై లేకపోవడం, సమాచారాన్ని అందించే సిబ్బందిని నియమించక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. రెండేళ్ల క్రితం నిరుపయోగంగా బస్సులు రాకుండా నిర్మానుష్యంగా ఉన్న బస్టాండ్‌ను అన్నివిధాల అభివృద్ధి పరుస్తామంటూ ఆర్టీసీ అధికారులు ముందుకు రావడం, గద్వాల డిపో బస్సులను మాత్రమే బస్టాండ్ వరకు కొనసాగించడంతో పాటు మరికల్, మహబూబ్‌నగర్‌లకు వెళ్లే నారాయణపేట డిపో బస్సులు కూడా బస్టాండ్‌కు వచ్చి వెళ్లేలా చేశారు. దీంతో ప్రయాణికులు కొత్త బస్టాండ్‌కు వెళ్లి బస్సులో ప్రయాణం చేయడానికి అలవాటు పడ్డారు. ప్రయాణికుల సౌకర్యం కోసం ప్రాంగణంలో మరుగుదొడ్లు, మూత్రశాలలను మాత్రం మరిచారు. శిథిలావస్థలో ఉన్న మరుగుదొడ్లను మరమ్మతు చేయకుండా వదిలిపెట్టడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చొరవచూపి యుద్ధ ప్రాతిపదికన మరుగుదొడ్లకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

కురుమూర్తిస్వామీ.. పట్టించుకోరేమీ?



జాతర మైదానంలో ఎండ వేడిమికి తట్టుకోలేక గొడుగులతో కింద చేరిన భక్తులు

- దర్శనానికి వచ్చిన భక్తులకు తప్పని అవస్థలు
- పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

చిన్నచింతకుంట: తెలంగాణ ప్రజల ఆరాధ్యదైవమైన అమ్మపూరం కురుమూర్తి స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే అతి ప్రాచీన పుణ్యక్షేత్రమైన కురుమూర్తి స్వామి ఆలయానికి లక్షల్లో భక్తులు ఉన్నారు. ప్రతి శని, సోమ వారాలతో పాటు అమవాస్య, స్వామివారి బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులు వేల సంఖ్యలో స్వామిని దర్శించుకోవడానికి వస్తుంటారు. కానీ అధికారులు వారికి వసతులు కల్పించడంలో మాత్రం విఫలమవుతున్నారు. ఆదివారం సైతం అలాంటి పరిస్థితే భక్తులకు ఎదురైంది. దీంతో తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కవగా ఉండడంతో అవస్థలు ఎదుర్కొన్నారు. జాతర మైదానంలో నీడటెంట్లు, దర్శనానికి వెళ్లే మెట్ల దారిలో మంచినీటి వసతి కూడా కల్పించలేదని పలువురు వాపోయారు. మధ్యాహ్న సమయంలో అన్నదానం సత్రం వద్ద ఎండలోనే బారులు తీరాల్సి వచ్చిందని ఆరోపించారు. అదేవిధంగా స్నానాలు ఆచరించేందుకు కోనేరులో నీరు లేకపోవడంతో వాటర్ ట్యాంకులను ఆశ్రయించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఇబ్బందులు పడుతున్నా పాలకమండలి, అధికారులు పట్టించుకోవడం లేదని ఆలయం వద్ద కనీస కనీస సౌకర్యాలు కల్పించడం లేదని పలువురు ఆరోపించారు. ఇన్‌చార్జ్ ఈఓ ఉండడంతో అధికారులు ప్రతిరోజు సమయపాలన పాటించడంలేదని అంటున్నారు. ఇప్పటికై నా స్పందించి వసతులు కల్పించాలని కోరుతున్నారు.

ఇబ్బందులు కలుగకుండా చూస్తాం..



ఆదివారం అమవాస్యను పురస్కరించుకొని స్వామివారి దర్శనానికి భక్తులు అనుకోని విధంగా తరలివచ్చారు. అందువల్ల నీడ టెంట్లు, వసతుల ఏర్పాట్లలో కొంత జాప్యం జరిగింది. మరోసారి పొరపాట్లు జరగకుండ చర్యలు చేపడతాం. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

– ప్రతాప్‌రెడ్డి, కురుమూర్తి స్వామి, ఆలయచైర్మన్

ఘనంగా నీటి దినోత్సవం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ ప్రకాశ్‌రెడ్డి

ధన్వాడ: మండలంలోని అన్ని గ్రామాలలో ఆదివారం నీటి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఉన్నవాటర్ ట్యాంక్ వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి మిషన్ భగీరథ ఏఈ ఉదయ్ ప్యూరిఫైడ్ వాటర్, మంచినీరు, వాడుకునే నీటిపై ప్రజలు చదివి వినిపించారు. ఇందులో సర్పంచ్ అమరేందర్‌రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో నీటి దినోత్సవం సందర్భంగా ర్యాలీలు నిర్వహించారు. జీపీ వర్కర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సప్ప, ఆయా గ్రామాల సర్పంచ్, ఆశమ్మ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మాగనూర్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం మండలంలో ఆయా గ్రామాల్లో మంచి నీళ్ల పండుగ దినోత్సవం నిర్వహించారు. మిషన్ భగీరథ తాగనీటి ట్యాంకుల దగ్గర ముగ్గులు వేశారు. ట్యాంకులకు మామిడి తోరణలతో అందంగా ముస్తాబు చేశారు. గతంలో గ్రామాలలో తాగు నీరు లేక వాగులో, బోరుబావులు వద్దకు వెళ్లి తెచ్చుకునేవారని బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇంటింటికి శుద్ధజలం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్యామలమ్మ, జెడ్పీటీసీ వెంకటయ్య, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, వైస్ఎంపీపీ తిప్పయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌ల, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని కోస్గి జెడ్పీటీసీ ప్రకాశ్‌రెడ్డి, ఎంపీపీ మధుకర్‌రావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కోయిలకొండ మండలంలోని కుసుమమ్మాద్ పల్లిలో ఆదివారం మంచి నీళ్ల పండుగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఉమ్మడి కోస్గి, మద్దూరు మండలాలకు ఇప్పటి వరకు నీటి సరఫరా, ఏ విధంగా నీటిని శుద్ధి చేస్తారో వివరించారు. అనంతరం సమావేశంలో ప్రజాప్రతినిధులను సన్మానించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈఈలు ప్రశాంత్, నాగబాబు, ఏఈలు నరేష్, ఎంపీటీసీలు వెంకటయ్య, లక్ష్మి, రెండు మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ధన్వాడలో నీటి దినోత్సవం



దామరగిద్ద నీటి ట్యాంకు వద్ద ముగ్గుల పోటీలు



కొత్తపల్లిలో మంచినీళ్ల పండుగలో నాయకులు